క్లుప్తంగా

89 మందికి నేత్ర పరీక్షలు



కొత్తపేటలో నిర్వహిస్తున్న నేత్ర వైద్య శిబిరం

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేట గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగంగా 89 మందికి కంటి పరీక్షలు చేపట్టారు. సమస్య ఉన్న వారికి మందులు అందజేశారు. 15 మందిని శస్త్ర చికిత్సలకు గుర్తించారు. సంస్థ అధ్యక్షుడు బొడిగి మధు, గ్రామ పెద్దలు బొడ్డేపల్లి సుధాకర్, పొన్నాడ అప్పలనాయుడు, పప్పల వెంకట రమణమూర్తి, అన్నెపు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సాయిరాం

రణస్థలం: మేమున్నాం సేవా సంఘం అధ్యక్షుడు పచ్చిగుళ్ల సాయిరాం పశ్చిమ బెంగాల్‌కు చెందిన కిడ్నీ బాధితుడు వి.వి.ఎస్.కుకేకు రూ.3 వేల ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు సోమవారం అందజేసి ఆదుకున్నారు. 20 ఏళ్ల క్రితం రణస్థలం బతుకు తెరువు కోసం కుకే వచ్చారు. రెండేళ్ల క్రితం కిడ్నీ వ్యాధి సోకి రెండు కిడ్నీలు పాడైపోయాయి. కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉండటంతో మేమున్నాం సేవా సంస్థ తరపున ప్రతి నెలా రూ.3 వేలు అందజేసి ఆదుకుంటామని సాయిరాం తెలిపారు.

బాసటగా నిలవాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

రణస్థలం: బంగ్లాదేశ్ ఉన్న హిందువులకు రక్షణ కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విశ్వహిందూ పరిషత్, పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులను అతికిరాతకంగా హతమార్చడం, ఆస్తులను ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. మన దేశంలో అక్రమ వలసదారులుగా నివసిస్తున్న బంగ్లాదేశీయులు తిరిగి వారి దేశం వెళ్లిపోవాలని హెచ్చరించారు.

అధికారుల పనితీరు భేష్



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస గ్రామాన్ని ఇటీవల డయేరియా అతలాకుతలం చేసింది. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించిన, పారిశుద్ధ్య పనులు చేపట్టి వ్యాధిని అదుపులోకి తీసుకువచ్చిన జిల్లా అధికారులు, స్థానిక వైద్యాధికారులను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి ధర్మవరపు సతీష్, సర్పంచ్ కామొజుల సీతారాం, ఎంపీటీసీ సభ్యుడు బెవర జగన్నాథం, గ్రామస్తుల సహకారం అభినందనీయమన్నారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ వెంకన్నబాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాకెందుకు ఈ శిక్షణ?



జెడ్పీ సీఈఓను నిలదీస్తున్న సర్పంచ్‌లు

జి.సిగడాం: శిక్షణ పేరుతో మాకు ఎందుకు శిక్ష పెడుతున్నారని జెడ్పీ సీఓఈ వెంకటరామన్ ఎదుట మండలంలోని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు సోమవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. అప్పులు చేసి గ్రామాల్లో పారిశుద్ధ్య, ఇతర అన్ని పనులు చేపడుతున్నామని, పంచాయతీల్లో చిల్లిగవ్వ కూడా లేదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకుడు, మధుపాం సర్పంచ్ బగాది అప్పలనాయుడు, పలువురు సర్పంచ్‌లు అన్నారు. ఆగస్టు 15వ తేదీన జాయతీ జెండా ఎగరవేయడానికి గ్రామ ప్రథమ పౌరుడికి అవకాశం లేకపోతే ఎందుకు ఈ శిక్షణలు, సమావేశాలని నిలదీశారు. పలు సమస్యలపై జెడ్పీటీసీ కాయల రమణ, సర్పంచ్‌లు కలిసి అధికారులకు వినతిపత్రం అందించారు. ఆర్పీ పేడాడ రాజు, ఎంపీడీఓ వెంకన్నబాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారాలకు చిరునామా..



చేపలు అమ్మకాలు చేస్తున్న మహిళలు



బట్టలు అమ్మకాలు చేస్తూ..



మొక్కలు అమ్మకాలు చేస్తున్న మహిళలు



కొబ్బరి బొండాలు విక్రయిస్తూ..

శ్రీకాకుళం కొత్త వంతెన రోడ్డు చిరు వ్యాపారాలకు చిరునామాగా మారింది. ఎంతోమందికి జీవనోపాధిని ఇస్తోంది. దత్తాత్రేయ గుడి వద్ద రోడ్డుకు ఇరువైపులా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ పలువురు కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. కూరగాయలు, కొబ్బరిబొండాలు, పండ్లు, చేపలు, మొక్కలు, బట్టల దుకాణాలు ఇక్కడ వెలిశాయి. అలాగే తినిబండారాలైన బజ్జీలు, చాట్, పానీ పూరితోపాటు టిఫిన్ దుకాణాలు సైతం ఈ రోడ్డులో దర్శనమిస్తుంటాయి. ఉదయం పూట కొంతమంది వ్యాపారాలు సాగిస్తే.. సాయంత్రం వేళల్లో మరి కొంతమంది జీవనోపాధి పొందుతున్నారు. రోజుకు రూ.20 చొప్పున ఆశీలు చెల్లిస్తున్నట్లు చిరువ్యాపారులు చెబుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

మాట తప్పిన ప్రభుత్వం

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి



ఎంఈవోకు నోటీస్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

గార: అసంబద్ధంగా ఉన్న ఉపాధ్యాయుల పని సర్దుబాటును బహిష్కరిస్తూ నోటీసు జిల్లా ఉపాధ్యాయుల సంఘాల ఐక్యవేదిక పక్షాన ఇవ్వడం జరిగిందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్‌వీ రమణమూర్తి అన్నారు. ఈ మేరకు నోటీసును ఎంఈవో ఎస్.రామకృష్ణకు సోమవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 117 జీవోతో పని సర్దుబాటు చేయడం విద్యారంగాన్ని వినాశనం చేయడమే అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యాశాఖా మంత్రి గతంలో జీవోను రద్దు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటలను కూటమి ప్రభుత్వం మరిచిందన్నారు. ఈ రోజు వెనుకడుగు వేయడం ఉపాధ్యాయ వర్గానికి అర్థం కాని ప్రశ్నగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ 1938 ప్రతినిధులు ఆనందరావు, గోవిందరావు, యూటీఎఫ్ ప్రతినిధిలు అర్జునరావు, కె.సురేష్‌కుమార్, ఎల్.బాబ్జీ, ఎం.వేంకటేశ్వరరావు ఉన్నారు.

జీఓ 117ను తక్షణమే రద్దు చేయాలి



ఎచ్చెర్ల క్యాంపస్: నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు



రణస్థలం: ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు



జి.సిగడాం: ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాఠశాలల మనుగడకు అటంకంగా మారిన జీఓ 117ను తక్షణమే రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఎచ్చెర్లలోని ఎమ్మార్సీ ఎదుట ఉపాధ్యాయులు ఫ్యాప్టో ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ జీఓ 117 స్థానంలో జీఓ 53ను అమలు చేయాలని కోరారు. అర్హులైన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలను బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే భవిష్యత్తులో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు బలివాడ ధనుంజయరావు, బల్లెడ రవి, పైడి శ్రీరామ్మూర్తి, గొంటి సురేష్ పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక ఎమ్మార్సీ ఎదుట అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఎంఈఓలు త్రినాథరావు, బి.లావణ్యకు వినతిపత్రం అందజేశారు.

జి.సిగడాం: స్థానిక ఎమ్మార్సీ వద్ద ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మజ్జి మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావుకు వినతిపత్రాలను అందజేశారు. ఫ్యాప్టో ప్రతినిధులు బోనేల గౌరీశ్వరరావు, ఎందువ వెంకటరమణ, కాయల రమేష్, శీరరాము, కిల్లారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రత్యేక రుణాలు

జి.సిగడాం:



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ రీజనల్ మేనేజర్, సీఎఫ్‌లు, సీసీలు

యూనియన్ బ్యాంకు ద్వారా అర్హులైన రైతులకు, మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యేక రుణాలను మంజూరు చేస్తున్నామని డిప్యూటీ రీజనల్ మేనేజర్ శోభానారాయణ ప్రసాద్ వెల్లడించారు. స్థానిక బ్యాంకులో సీఎఫ్‌లు, సీసీలతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జి.సిగడాం బ్యాంకు నుంచి వచ్చే నెల 30వ తేదీ నాటి రూ.5 కోట్ల రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వస్తుందన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులై రైతులకు ప్రత్యేక రుణాలను అందిస్తామన్నారు. బంగారం, వాహనాలు, గృహాలతోపాటు పలు రకాల రుణాలను మంజూరు చేస్తామన్నారు. ఇప్పటికే బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను వారం రోజుల ముందు చెల్లిస్తే తీసుకున్న రుణం మేరకు వడ్డీ రాయితీ వర్తింపు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శాంతకుమార్, ఫీల్డ్ అధికారి బోస్, బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీటీఏస్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమయ్యేట్లు చూడాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఎస్) శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సీర రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి పడాల ప్రతాప్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బంగారు షణ్ముఖరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కవిటి నూకరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను వినతి పత్రాన్ని అందజేశారు. తక్షణమే జీవో నంబర్ 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని, 3, 4, 5 తరగతులను హైస్కూల్‌కు తరలింపును రద్దు చేయాలని, అంగన్‌వాడీల విద్యా కార్యక్రమాలను పటిష్టం చేయాలని, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మాధ్యమం బోధనపై స్పష్టతనివ్వాలని, కేజీబీవీలు, బాలికల వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

శ్వేతపుష్కరిణిని అభివృద్ధి చేస్తాం

గార:



ఎమ్మెల్యే శంకర్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

శ్రీకూర్మనాథాలయంలోని పవిత్ర శ్వేతపుష్కరిణిని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆలయాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లక్ష్మీదేవిని దర్శించుకున్నారు. ఆలయంకి వచ్చే భక్తులకు వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం లేకపోవడం గుర్తించామని, వాటికి చర్యలు తీసుకుంటామన్నారు. మన గుడి బాగుంటే గ్రామం బాగుంటుందని.. శ్రీకూర్మం గ్రామస్తులు సహకరించాలన్నారు. దేవాలయ భూముల వివరాలను ఆలయ ఈవో జి.గురునాథాన్ని అడిగి తెలుసుకున్నారు. సత్రం పునఃనిర్మాణం చేసేందుకు కేంద్ర మంత్రి సహకారం తీసుకుంటామని, అవసరమైన లేఖలు తయారు చేయాలన్నారు. అన్నదానాన్ని పరిశీలించారు. ప్రసాదాన్ని స్వీకరించి నిత్యం ఇలాగే నాణ్యతగా ఉంచాలన్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, స్థానిక నాయకులు ఉన్నారు.

పారిశ్రామిక అవసరాలపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్:



మురళీకృష్ణను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఇంజినీరింగ్ విద్యార్థులకు పారిశ్రామిక అవసరాలపై అవగాహన అవసరమని గుజరాత్ రాష్ట్రం రాజ్కోట్‌లోని ఆటోమోటీవ్ ప్లాంట్ క్యూఎం హెడ్ వై.మురళీకృష్ణ అన్నారు. చిలకపాలెంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సోమవారం మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇండస్ట్రియల్ మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్, క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టం తదితర అంశంపై అవగాహన కల్పించారు. పరిశ్రమల్లో సాంకేతిక ప్రగతి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ వంటి అంశాలు కీలకమన్నారు. విద్యార్థులు మారుతున్న సాంకేతిక అంశాలు, పరిశ్రమల అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరిశ్రమల్లో ఇన్‌టర్న్‌షిప్ చేయటం వల్ల మార్పులు గమనించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



డ్రగ్స్‌పై చైతన్య పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌జీయూకేటీ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు చెడు వ్యసనాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. ఎస్ఎంపురం క్యాంపస్‌లో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సోమవారం నషా ముక్త్ భారత్ (మాదక ద్రవ్యాల రహిత భారత్) కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల చేకూరే నష్టాలపై పోస్టర్ విడుదల చేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డైరెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఉత్తమ మానవ వనరులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. విద్యార్థులు గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇచ్చి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ రవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ముకుందరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పాన్ ఇండియా ఆనందోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ గురూజీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని పెద్దపాడు హ్యాపినెస్ సెంటర్ వద్ద మంగళవారం నుంచి పాన్ ఇండియా ఆనందోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రతినిధులు డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు, టీచర్ దేసూళ సురేంద్రలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 13 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఉదయం 5.30 నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అఖరి రోజైన 18వ తేదీన గురూజీ లైవ్ కార్యక్రమంలో ప్రసంగిస్తారన్నారు. హాజరయ్యేందుకు ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను ముందుగా 79897 52675 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

అమల్లోకి ట్రాఫిక్ ఆంక్షలు



సింధూర జంక్షన్ నుంచి ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే మార్గంలో ఉదయం బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ మళ్లింపుపై ఆంక్షలు సోమవారం నుంచి మొదలయ్యాయి. కొంత కాలంగా పలు ప్రైవేటు ట్రావెల్స్, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాల తాకిడితో కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కిక్కిరిసి ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన విషయం తెలిసిందే. కొత్త ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి వచ్చి రావడంతోనే ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టిసారించారు.

రంగనాథన్‌కు ఘన నివాళులు



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో రంగనాథన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల: మురపాకలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మహిళా డిగ్రీ కళాశాలలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, పీఎల్‌పీ భారతి, సీహెచ్ కృష్ణారావు



ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో రంగనాథన్ సేవలను గుర్తుచేసుకుంటున్న ఇన్‌చార్జిర్జ్ ప్రిన్సిపాల్ సత్యన్నారాయణ తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: గ్రంథాలయ ఉద్యమకారుడు ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని ఎచ్చెర్ల గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన గొప్పతనాన్ని, గ్రంథాలయాలు ఏర్పాటుకు చేసిన కృషిని స్మరించుకున్నారు. గ్రంథాలయ అధికారి జి.నీలమ్మ, పాఠకులు పాల్గొన్నారు. లావేరు మండలంలోని మురపాక, లావేరు మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాల్లో రంగనాథన్ జయంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి తలేరాంబాబు, సహాయకులు షణ్ముఖరావు, తిరుపతిరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.